రెండే మార్గాలు. 1 నిరంతరం దైవధ్యానం, 2 నిరంతరం ఆత్మధ్యానం. ఆత్మ అంటే చైతన్యము. చైతన్యానికి రూపంలేదు. నిరంతరం ఆత్మని ధ్యానించటం వలన బుద్ధి నిర్మలం అవుతుంది. దైవాన్ని అంటే రాముడినో, కృష్ణుడినో నిరంతరం ధ్యానించటం వలన కూడా బుద్ధి నిర్మలమవుతుంది. మీకు ఏమార్గం ఇష్టం అయితే ఆ మార్గంలో ప్రయాణం చేసి తరించండి.

రామనామ స్మరణ చేసుకునేవాడు పవిత్రుడు అవుతాడు. పరమపవిత్రుడు కాని వాడికి ఆత్మజ్ఞానం కలగదు. రాముడు అంటే రంజింప చేసేవాడు, రాముడు అంటే జ్ఞాన స్వరూపుడు. మీరు రామనామం చేసుకుంటే రాముడు మనకి ధనాన్ని ఇస్తాడు, గుణాన్ని ఇస్తాడు. ఆ ధనాన్ని, గుణాన్ని సద్వినియోగం చేసుకుంటే జ్ఞానాన్ని ఇస్తాడు. రాముడు సర్వ సమర్థుడు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 19-03-2011, చించినాడ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

వేదముల యొక్క సారమే భగవద్గీత. భగవద్గీత మీ జేబులో ఉంటే నాలుగు వేదములు మీ దగ్గర ఉన్నట్లే. భగవద్గీత సమగ్రమైన గ్రంథం. మనం చైతన్యస్థాయిని అందుకోవటానికి అన్ని కోణాల్లోంచి భగవద్గీతలో ప్రతిపాదనలు ఉన్నాయి. మమ్మల్ని భగవద్గీత ఎప్పుడైనా చదవమంటారా అని ఒకరు భగవాన్‌ని అడిగారు. ఎప్పుడైనా కాదు, మీకు అవకాశం ఉంటే ఎప్పుడూ చదువుకోండి అన్నారు. మన హిందువులు ఎక్కువగా భగవద్గీత పారాయణ చేస్తారు. మనం చెయ్యవలసిన పనులు, చెయ్యకూడని పనులు గురించి గీతలో వివరంగా చెప్పారు. మనం ఎలాగ మాట్లాడాలి, మనం ఎలాగ పనిచేస్తే మనకి ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం అలవడుతుందో ఇవన్నీ గీతలో ప్రతిపాదించారు. నీచేతిలో ఉన్న పని నువ్వు చెయ్యాలి. ఆ పని జరగవచ్చు, జరగకపోవచ్చు. జరిగిందని సంతోషపడకూడదు. ఆపని జరగలేదని మనం డిప్రెషన్‌లోనికి వెళ్ళకూడదు. ఆపని అలా జరగకపోవటానికి కారణం కేవలం మన సోమరితనం కాదు, మన తెలివితక్కువతనం కాదు, మనం కష్టపడి పనిచేసినా, డెడికేటెడ్‌గా పనిచేసినా ఒకోసారి రిజల్ట్ మనకి అనుకూలంగారాదు. ఒకోసారి ఆ పని జరిగినా మన తెలివితేటల వలన జరగలేదు. అది భగవంతుడి సంకల్పాన్ని బట్టి అలా జరిగింది. నేను తెలివైన వాడిని, నేను తెలివితక్కువ వాడిని, నేను అది సాధించాను, ఇది సాధించాను, అది సాధించలేకపోయాను, ఇది సాధించలేకపోయాను అని నువ్వు అనుకుంటున్నావు అంటే భగవంతుడి సంకల్పానికి భిన్నంగా నువ్వు ఏదో చెయ్యాలని అనుకుంటున్నావు. అది

ఒకరకమైన దురాలోచన అన్నాడు పరమాత్మ. భగవంతుడి సంకల్పం బలీయమైనది. భగవంతుడి సంకల్పాన్ని మనం అంగీకరించకపోతే మనకి దుఃఖం వస్తుంది. పని జరిగినా, జరగకపోయినా భగవంతుడి సంకల్పం అలా ఉంది అనుకుంటే మీకు ఎవరికీ దుఃఖంరాదు. ఈశ్వర సంకల్పం ఎలా ఉన్నా నీ డ్యూటీ నువ్వు చెయ్యాలి. నీ డ్యూటీ నువ్వు చెయ్యకపోతే నీకు సోమరితనం వస్తుంది. భగవంతుడికి భిన్నంగా అసలు నువ్వు లేవు. నువ్వు భగవంతుడికి భిన్నంగా ఉన్నాను అనుకుంటున్నావు. ఆ దురాలోచన వల్లే నీకు దుఃఖం వస్తోంది.

ప్రపంచంలో ఉన్న మాయలో డబ్బు మాయ ఒకటి. డబ్బు సంపాదించేవాడికి ఇంక సంతృప్తి ఉండదు. డబ్బుపిచ్చి ఉన్నవారు లక్ష్మీదేవిని ప్రార్థిస్తారు. చదువు పిచ్చి ఉన్నవాళ్ళు సరస్వతీ దేవిని ప్రార్థిస్తారు. అవి రెండూ ప్రకృతి గొడవలే, అవి మోక్షానికి దారి చూపించవు అని గౌడీయ మఠం వాళ్ళు చెబుతారు. మేము రాధాకృష్ణులని ఎందుకు ప్రేమిస్తాము అంటే రాధయొక్క ఇంద్రియాలు, మనస్సు అన్నీ కృష్ణుడి మీదే కేంద్రీకృతం అయిఉంటాయి. మనం రాధని స్మరించటం వలన మనకి డబ్బుపిచ్చిపట్టుకోదు, చదువుపిచ్చీ పట్టుకోదు, పరమాత్మని ఎలా పొందాలి, పరమాత్మలో ఎలా ఐక్యం అవ్వాలి అనే దానికి రాధ మనకు ఆదర్శం. రాధయొక్క ప్రేమ మన చేత పరమాత్మని పొందింపచేస్తుంది, అందుచేత మేము రాధని ప్రేమిస్తాము అని హరేకృష్ణా వాళ్ళు చెబుతారు. రాధకు కృష్ణుడి మీద ఉన్న ప్రేమ వ్యాపారం కాదు. అది అలౌకిక ప్రేమ, అభౌతికమైన ప్రేమ. రాధయొక్క ప్రేమ పరమాత్మ మీద ఉంది. అలా పరమాత్మని ప్రేమిస్తూ ఉంటే సహజంగానే ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం వచ్చేస్తుంది. అప్పడు ఇంక విషయచింతన ఆగిపోతుంది. అదీ రాధ యొక్క ప్రేమ. ఆ ప్రేమలో క్వాలిటీ ఉంటుంది. ఆ ప్రేమ శరీరానికి కాని, ఇంద్రియాలకు కాని, మనస్సుకు కాని సంబంధించినది కాదు. ఆ ప్రేమవల్ల నువ్వు పరమాత్మలో ఐక్యమవుతావు. కృష్ణస్మరణ చేసి రాధ ఆకృష్ణుడిలో ఎలా ఐక్యమయ్యిందో అలాగే మనం కూడా ఆ పరమాత్మలో ఐక్యం కావాలని ఎగ్జాంపుల్ కోసం రాధే చైతన్యుడిగా వచ్చి పూరీ జగన్నాథస్వామిలో ఐక్యమయ్యింది. శ్రీకృష్ణచైతన్యుడు గొప్ప ఇంద్రియనిగ్రహం గలవాడు. పంచదార ఆయన నాలుక మీద వేస్తే పంచదార ఒక కణంకూడా తడి అవ్వదు అటువంటి నిగ్రహం కలవాడు. తత్వం మీద మీకు శ్రద్ధ కలిగినా ఇంద్రియనిగ్రహం మనోనిగ్రహం మీకు సహజంగానే వచ్చేస్తాయి.

మనకి సత్సంగాలు దేనికోసం అంటే మనలో ఉన్న అజ్ఞానం అనే చీకటి పోవటం కోసం. మనం ఒక చీకటి గదిని చూశాము అనుకోండి. ఆ గదిలో మనం వెలుతురు

చూడాలంటే లైటు వేసుకోవాలి. మనకి వెలుతురు అక్కరలేకపోతే లైటు వేసుకోనక్కరలేదు. అలాగే మనం ఏ అజ్ఞానంలో ఉన్నామో ఆ అజ్ఞానంలో మనం ఉండిపోవాలి అనుకుంటే సత్సంగాలు అక్కరలేదు. చీకటి గదిలో లైటు వేస్తే ఆ లైటు గదికి ఎలా వెలుగుని ఇస్తుందో అలాగ మన హృదయంలో ఉన్న అజ్ఞానాన్ని పోగొట్టి అక్కడ కాంతిమయం చేయటమే సత్సంగాలయొక్క ప్రయోజనం, కాని భౌతికమైన ప్రయోజనం ఏమీలేదు.

బృందావనంలో ఎక్కడ ఏ సంఘటన జరిగిందీ ఎవరికీ తెలియదు. శ్రీకృష్ణచైతన్యుడు బృందావనం వచ్చి ఆ మట్టి వాసన చూచి ఇక్కడ కృష్ణుడు గోవర్ధనపర్వతాన్ని ఎత్తాడు. ఇక్కడ కాళీయమర్దన చేశాడు, ఇక్కడ రాసలీలలు చేశాడు అని ఆ ప్రదేశాన్ని ఐడెంటిఫై చేసినవాడు శ్రీకృష్ణచైతన్యుడు. ఆయన వచ్చిన తరువాతే బృందావనానికి వికాసం వచ్చింది. చైతన్యుడు బృందావనం వెళ్ళి చూసి వచ్చేవాడు కాని అక్కడ ఉండేవాడు కాదు. పూరీలో ఉండిపోయేవాడు. చైతన్యుడిది ఎక్కువ నామ సిద్ధాంతం. శ్రీకృష్ణచైతన్యుడు ఎక్కువ కృష్ణ నామం చేస్తూ ఉండేవాడు. కలియుగంలో బుద్ధిలో దోషాలు ఎక్కువ ఉంటాయి, మనుషులు కుదురుగా ఉండరు, ఉన్నవాళ్ళూ ఏడుస్తూ ఉంటారు, లేనివాళ్ళు ఏడుస్తూ ఉంటారు, ఇక్కడ తరించటానికి ఏదైనా మంత్రం చెప్పమని నారదుడు బ్రహ్మదేవుడిని అడిగారు. అప్పుడు బ్రహ్మదేవుడు హరేరామ హరేరామ, రామరామ హరేహరే, హరేకృష్ణ హరేకృష్ణ, కృష్ణకృష్ణహరేహరే అని ఈ మంత్రం మంచిది. కలియుగంలో ఇది చేసుకోండి అని బ్రహ్మదేవుడు నారదుడికి చెప్పాడు. చైతన్యుడికి కులభేదం లేదు. ఆయన బ్రాహ్మణుడు, మహాపండితుడు, వ్యాకరణ శాస్త్రవేత్తకూడా. హరేరామ, హరేరామ, రామరామహరేహరే, హరేకృష్ణ, హరేకృష్ణ, కృష్ణకృష్ణ హరేహరే అని చైతన్యుడు ప్రజల్లో ప్రచారం చేసేవాడు. అప్పుడు బ్రాహ్మణులు ఆయనకు ఎదురు తిరిగారు. ఆ మంత్రం బ్రాహ్మణులే చెయ్యాలి ఇది సాంప్రదాయం, వెనుకబడిన కులాలు చెయ్యటానికి వీలులేదు. నువ్వు ఇతర కులాలకు కూడా వెళ్ళి ఈ మంత్రాన్ని ప్రచారం చేస్తున్నావు, ఇది నీకు తగదు అని చైతన్యుడి మీద పేచీలు మొదలు పెట్టారు. వెనుకబడిన వర్గాలు కూడా జీవులే, స్త్రీలుకూడా జీవులే వాళ్ళుకూడా తరించాలి. నేను సాంప్రదాయాన్ని వదిలేస్తున్నాను. మీరు నా తోటి పేచీకి రాకండి అన్నాడు. నేను ఒక ఉపాయం చెబుతున్నాను. బ్రహ్మదేవుడు హరేరామ, హరేరామ అని మొదలుపెట్టి చెప్పాడు. నేను దానిని తిరగేసి హరేకృష్ణ, హరేకృష్ణ అని మొదలుపెట్టి చెబుతాను అన్నాడు చైతన్యుడు. నువ్వు చెప్పినట్టు చేస్తే ఎవరికీ ఫలితం రాదులే చేసుకో అన్నారు సాంప్రదాయవాదులు. దీనిగురించి శ్రీకృష్ణచైతన్యుడిని కొంతమంది అపార్థం చేసుకుంటున్నారు కాని కొన్ని కులాలవారు

చైతన్యుడి మీద దాడి చేస్తే అప్పుడు ఈ మంత్రం మార్చాడు. తుకారామ్, నామదేవుడు, ఏకనాధుడు ఇలా అనేకమంది భక్తులు భక్తిమార్గంలో నామం చేసి తరించారు.

భగవద్గీత మీకు అర్ధం అవ్వటంలేదని కంగారుపడకండి. యింద్రియనిగ్రహం, మనోనిగ్రహం లేకుండా మీరు భగవద్గీత చదవవచ్చు, చదివినా మీకు భగవద్గీత అర్ధంకాదు. ఇంద్రియాలకి, మనస్సుకి అతీతంగా వెడితే కొన్ని విషయాలు మీకు అర్ధం అవుతాయి. నువ్వు ఇంద్రియాల్లోంచి, మనస్సులోంచి విడుదల పొందితేనే నీకు సత్యం తెలుస్తుంది. నీ ఇంద్రియాలకి, నీమనస్సుకీ తెలిసినవే శాస్త్రంలో చెబితే ఇంక శాస్త్రం ఎందుకు? మీకు ఏ విషయంమీద అయితే ఎక్కువ మోహం ఉందో ఆ విషయం గురించే శాస్త్రంలో చెబితే అది శాస్త్రం ఎలా అవుతుంది? నీకు నచ్చినా నచ్చక పోయినా దేహానికి అతీతంగా, మనస్సుకి అతీతంగా, ఇంద్రియాలకి అతీతంగా, ప్రపంచానికి అతీతంగా నిన్ను తీసుకు వెళ్ళే వాక్యాలు పరమాత్మ చెప్పాడు. అదే భగవద్గీత. నామం నిరంతరం చేయటం వలన నీకు అక్కరలేని తలంపులు అన్నీ ఆగిపోతాయి. రమణమహర్షి శరీరాన్ని చూచి ఆయన గురువు అనుకుంటాము, మనం ఆయన భక్తులం అనుకుంటాము. అప్పుడు మనకి ముందు స్థూలసంబంధం ఏర్పడుతుంది. అలాగ స్థూలంగా ఆరూపాన్ని, ఆ నామాన్ని జపించగా, జపించగా స్థూల సంబంధం పోయి మన మనస్సు అంతర్ముఖమయ్యి అప్పుడు సూక్ష్మ సంబంధం ఏర్పడుతుంది. అప్పుడు గురువు శరీరం కనిపించినా, కనిపించకపోయినా ఒక్కటే. ఇప్పుడు భగవాన్ శరీరం కనిపిస్తోందా? కనిపించటం లేదు, అలాగని ఆయన మీద మనకి భక్తి లేకుండా ఉన్నామా? మనకి ఆయన మీద భక్తి ఉంది. మన శరీరం చనిపోయినప్పడు అందరితోటి సంబంధాలు తెగిపోతాయి, పరిసరాలుతోటి కూడా సంబంధం తెగిపోతుంది కాని గురువుతోటి ఉన్న సూక్ష్మసంబంధం తెగదు. అది జ్ఞాపకం పెట్టుకోండి. గురువుతోటి ఉన్న సంబంధం ఎప్పటివరకు తెగదు అంటే ఆయన వేరు, నేను వేరు అనే బేధబుద్ధి కంప్లీటుగా పోయిన తరువాత, సత్యంతోటి నీకు వన్‌నెస్ వచ్చిన తరువాత అప్పుడు గురువుతోటి ఉన్న సూక్ష్మసంబంధం తెగిపోతుంది, కాని అప్పటివరకూ సూక్ష్మ సంబంధం నీకు తెగదు.

మీకు నిద్దట్లో ఎక్కడైనా దుఃఖం ఉందా? అక్కడ దుఃఖం లేదు. మీకు తలంపు వచ్చిన తరువాత దుఃఖం వస్తోంది. అంటే దుఃఖం తలంపు రూపంలో ఉంది. మీరు నామాన్ని శ్రద్ధగా చేయగా, చేయగా ఆ నామం ఏమి చేస్తుంది అంటే చెడ్డ తలంపులని తరిమి వేస్తుంది. అప్పుడు మీరు నిజస్థితిలోకి వెళ్ళటానికి ఆ నామం సహకరిస్తుంది. మనం

ముందు శాస్త్రాన్ని నమ్మాలి. లేకపోతే సాధన చేయలేము. మీకు సంతోషం కలిగించే తలంపులు వస్తే రండి, రండి అంటున్నారు. మీకు దుఃఖం కలిగించే తలంపులు వస్తే వద్దు, వద్దు అంటున్నారు. సంతోషం కలిగించే తలంపులు కూడా భవిష్యత్తులో మీకు దుఃఖాన్ని తీసుకువస్తాయని తెలియకపోవటం వలన వాటిని రమ్మంటున్నారు, ఎవ్విరితాట్ ఈజ్ సారోఫుల్. ప్రకృతిలోంచి మీరు ఏ ప్లెజరు తీసుకున్నా పరిణామంలో ఏదొక రోజున పెయిన్ కింద మారిపోతుంది. జప, ధ్యానములు ఎందుకు చెప్పారు అంటే, నువ్వు ఒక రూపంతోటి నామంతోటి తాదాత్మ్యం పొందుతున్నావు. నీ రూపబుద్ధిని బట్టి, నీ నామబుద్ధినిబట్టి చైతన్యానికంటే నేను భిన్నంగా ఉన్నాను అనుకుంటున్నావు. మీ హృదయంలో ఒకనిజం ఉంది. ఆ నిజం వైపుకి దారి చూపించి నిజంలో స్థిరపడేటట్టు చేయటానికే ఈ జపము, ధ్యానము. మేము రోజూ జపాలు చేసుకోవటం, తపస్సు చేసుకోవటం ఇదే పనా? దీనికి ముగింపులేదా అని ఒకరు భగవాన్‌ని అడిగారు. నువ్వు జపం ఎంత వరకు చెయ్యాలి అంటే నీకు ఉచ్ఛ్వాస నిశ్వాసలు ఎంత సహజంగా జరుగుతున్నాయో అంత సహజంగా నామం జరిగే వరకూ చేస్తే సరిపోతుంది. నీకు నామం సహజమవ్వాలి. రాత్రి ఒంటిగంటకు ఎవరైనా నిన్ను లేపారనుకో అప్పుడు నీకు నారాయణ స్మరణ జరుగుతూ ఉండాలి. నీ హృదయంలో ఒక వస్తువు సహజంగా ఉంది, నార్మల్‌గా ఉంది. నువ్వు అంత నార్మల్‌గా జపం చేయకలుగుతూ ఉంటే, అంత సహజంగా ధ్యానం చేయకలుగుతూ ఉంటే అప్పుడు లోపల ఉన్న సద్వస్తువు నీకు వ్యక్తమవుతుంది. ఆ సద్వస్తువు వ్యక్తమైన తరువాత జపం చేసే జపి కనబడడు. అప్పుడు నీకు ఆత్మసాక్షాత్కారం అవుతుంది.

మీరు దైనందిన జీవితంలో ఇంద్రియాలని, మనస్సుని దేహబుద్ధి తగ్గటానికి ఉపయోగించుకోవాలి. దేహబుద్ధి తగ్గటానికి మేగ్జిమమ్ వాటిని ఉపయోగించుకుంటే ఈ శరీరం ఉండగానే మీకు ఆత్మబుద్ధి కలుగుతుంది. మీరు ఎవరికైనా ఉపకారం చేసారనుకోండి వారికి మీ పట్ల కృతజ్ఞత లేదు అనుకోండి మీకు ఏమీ నష్టం లేదు మీరు భగవంతుడి అనుగ్రహానికి పాత్రులవుతారు. చాలామంది ఏమంటారు అంటే మేము వాళ్ళకి చాలా ఉపకారం చేసాము, వాళ్ళు అంతా మరచిపోయారు అంటారు. ఈ జీవుడు కాదు కదా మీకు మోక్షం ఇచ్చేది. మీరు చేసిన సెల్ఫ్‌లెస్ వర్కు భగవంతుడి దయకి మిమ్మల్ని పాత్రుల్ని చేస్తుంది. మీరు పవిత్రులవుతారు. అందరికీ ఉన్న చెడ్డ ఏమిటి అంటే గుర్తింపులు కోరుకోవటం. ఇతరులచేత మనం గుర్తింపబడటం అనేది మనస్సుకి ఫుడ్. అది దేహబుద్ధిని

పెంచేస్తుంది. ఆ పని చెయ్యమని భగవంతుడు చెప్పాడు కాబట్టి నువ్వు పని చేస్తున్నావు అంతే నీకు గుర్తింపులు అక్కరలేదు అనుకో అంటే మన ఇంద్రియాలు, మన మనస్సు భగవంతుడు చెప్పిన ప్రకారం వర్కు చేస్తున్నాయి అనుకోండి ఇంక మనం ప్రత్యేకంగా కష్టపడనక్కరలేదు స్లోగా దైనందిన జీవితవిధానంలో దేహబుద్ధి పడిపోతుంది, దైవబుద్ధి కలుగుతుంది. అప్పుడు చావు పుట్టుకలతోటి సంబంధంలేదు. ఇంక గోయింగులేదు, కమింగులేదు. అటువంటి అద్వైతానుభవం మీకు తీసుకురావటానికే, ఏదైతే ఎప్పుడూ ఉందో అక్కడికి మిమ్మల్ని తీసుకువెళ్ళటానికే శాస్త్రం ప్రయత్నం చేస్తోంది. అది మీ అనుభవానికి విరుద్ధంగా ఉంది కాబట్టి మన మనస్సు శాస్త్రాన్ని అంగీకరించనివ్వదు. ఎందుచేతనంటే మీలో ఉన్న పవిత్రత సరిపోదు, ఏకాగ్రత సరిపోదు. ఎంతోకొంత సెల్ఫ్‌లెస్ వర్క్ చేయటం వలన భగవంతుడిని తెలుసుకోవటానికి మీ మైండు స్లోగా ప్రిపేర్ అవుతూ ఉంటుంది.

జ్ఞానం అంటే చాలా కష్టం అనుకోకండి. మీ రూపబుద్ధి, నామబుద్ధే చైతన్యానికంటే మనం భిన్నంగా ఉన్నాము అని అనిపింపచేస్తుంది. అక్కడనుంచి మనకి సఫరింగ్ ప్రారంభమవుతుంది. చెట్టు నుండి కొబ్బరికాయ రాలినట్టు నీలోంచి రూపబుద్ధి, నామబుద్ధి రాలిపోతే ఇంక జపంతోటి, తపస్సుతోటి నీకు పని ఏమిటి? మనకి భగవంతుడితోటి సెపరేటెనెస్ ఉన్నట్టు తెలుస్తోంది కదా! ఆ సెపరేట్‌నెస్ మనకి పోవాలి. శ్రీకృష్ణచైతన్యుడు, శ్రీకృష్ణుడికోసం ఎలా తపించాడో అలా తపిస్తే మనకి సెపరేట్‌నెస్ పోతుందని చైతన్యుడి అవతారం వచ్చింది. మీకు ఏ విషయంలోంచి దుఃఖం వస్తున్నప్పటికీ, ఏ సందర్భంలో అశాంతి వచ్చినప్పటికీ అక్కడ జ్ఞానం లేదని అర్థం. భగవంతుడు సంకల్పాన్ని మీరు అంగీకరించలేకపోతున్నారు. భగవంతుడు వేరు, మనం వేరు అనుకోవటం వలన ఆయన సంకల్పాన్ని యాక్సెప్ట్ చేయలేకపోతున్నాము, రిజెక్టు చేస్తున్నాము. అక్కడ నుండి దుఃఖం ప్రారంభమవుతుంది. డాక్టరుగారి దగ్గరికి పేషెంటు ఎందుకు వెడతాడు? డాక్టరుగారికి ఎన్ని డిగ్రీలు ఉన్నాయో పేషెంటుకి అక్కరలేదు, డాక్టరుగారు ఎక్కడ చదువుకున్నారో పేషెంటుకి అక్కరలేదు పేషెంటుకి రోగం తగ్గాలి. డాక్టరుగారు పని పేషెంటు ఏ రోగంతో వచ్చాడో ఆ రోగాన్ని తగ్గించి పంపాలి. అలాగే మేము చెప్పే ఈ ప్రవచనాలు మిమ్మల్ని దుఃఖంలేని స్థితికి తీసుకువెడితేనే మా ప్రసంగాల యొక్క ప్రయోజనం. మేము ఎర్రబట్టలు కట్టుకున్నామా? తెల్ల బట్టలు కట్టుకున్నామా? మీకు అనవసరం. గృహస్థాశ్రమంలో ఉన్నా కర్మఫల త్యాగి సన్యాసి అని పరమాత్మ చెప్పాడు. మిమ్మల్ని దుఃఖంలేని స్థితికి మేము తీసుకువెళ్ళకలిగితే

మేము ఏ బట్టలు కట్టుకున్నా ఒకటే. మీకు అనేక కారణాల వల్ల దుఃఖం రావచ్చు. ఏ కారణం వలన దుఃఖం వచ్చినా అక్కడ అజ్ఞానం ఉందని అర్థం. గురువుకి ఉండవలసిన లక్షణాలు ఏమిటి అంటే గురువు ఏదైనా విషయాన్ని ఆలోచించేటప్పడు లోతుగా ఆలోచించాలి ఆలోచించిన విషయాన్ని చెప్పేటప్పడు ఇతరులకి అర్థమయ్యేలాగ తేలిక మాటలతోటి చెప్పాలి.

భగవాన్ ఏమన్నారు అంటే మీకు ఏదైనా సంతోషం వస్తోంది అనుకోండి ఈ సంతోషించే నేను ఎవరు? మీకు దుఃఖం వస్తోంది అనుకోండి, ఈ దుఃఖపడే నేను ఎవరు? అని ఎక్కడికక్కడ ప్రశ్నించుకొని దానిని కత్తిరించేయండి. అప్పడు మీ మనస్సుకి అంతర్ముఖం కలుగుతుంది. అంతర్ముఖం అయిన మనస్సు హృదయంలో లయమైపోతుంది. అంటే ఈ ఫాల్స్ ఐ హృదయంలో ఉన్న ట్రూత్‌ని చూడగలిగితే ఇది డిజప్పియర్ అయిపోతుంది. మీకు ఇష్టంలేని వాళ్ళు ఎవరైనా స్కూటరు మీద నుండి పడిపోయారు అనుకోండి మీకు సంతోషం వస్తుంది, వాళ్ళకి రెండు కాళ్ళు విరిగిపోయాయి అనుకోండి మీకు ఇంకా సంతోషం వచ్చేస్తుంది, సంతోషం ఎందుకు వస్తుంది అంటే వాడి మీద మీకు ద్వేషం ఉంది. వాడిమీద ఉన్న ద్వేషం మీకు నెరవేరింది. ఆ వార్త వినపడగానే మీ మనస్సు లోపలికి వెళ్ళికొంత శాంతిని పీల్చుకుని మళ్ళీ సహస్రారానికి వచ్చేస్తుంది. అప్పడు కూడా శాంతి హృదయంలోంచే వస్తుంది. అది ఒకరోజో రెండు రోజులో ఉంటుంది. మరల అశాంతి వచ్చేస్తుంది. అందుచేత ప్రతీ మనిషి సత్యాన్వేషకుడిగా ఉండాలి, భక్తులు అందరికీ సత్యం రివీల్ అవ్వదు. సత్యాన్ని ఎవరైతే ప్రేమిస్తున్నారో, ఎవరైతే సత్యాన్వేషకుడిగా ఉన్నారో వారికి మాత్రమే సత్యం తెలియబడుతుంది. శాంత చిత్తము గలవాడు సత్యాన్వేషకుడు అవుతాడు. ఒకడికి అనుకూలమైన ఉద్యోగం దొరికితే, వాడికి అనుకూలమైన భార్య దొరికితే, వాడికి పరిస్థితులు అన్నీ అనుకూలంగా ఉంటే లోకంలో వాడిని అదృష్టవంతుడు అని అనుకుంటారు. కానీ వీళ్ళందరికంటే శాంత చిత్తము కలవారు అదృష్టవంతులు. ఉపనిషత్తులో ఏమని చెప్పారంటే సత్యము ఎవరినైతే ఎన్నుకుందో వాడికే తెలియబడుతుంది కాని సత్యం ఇతరులకు తెలియబడదు అని చెప్పారు. మనకి సాధన లేదు అనుకోండి ఏమీ కృషి లేదు అనుకోండి, సత్యాన్వేషణ కోసం మనకి తపన లేదు అనుకోండి వందేళ్ళు బతికినా ప్రయోజనం ఏముంది? ఇవాళ తిన్న అన్నమే రేపు తింటున్నాము. ఇంక ప్రయోజనం ఏముంది? మనకి అంతర్దృష్టి లేనప్పడు మనకు సత్యాన్వేషణ లేనప్పడు వంద సంవత్సరాలు బతికినా ప్రయోజనం లేదు.